# కామ్రేడ్ రేవంత్ రెడ్డి



**అటు కమ్మ, ఇటు రెడ్డి సామాజిక వర్గాల అండాదండలు**
**టీడీపీ నేపథ్యం, చంద్రబాబు శిష్యుడిగా కమ్మల ఆదరణ**
**ఈసారి తమవాడు ఎలాగైనా గెలవాలని ఏకమైన రెడ్డిలు..**
**గతంలో వెల్ కమ్ గ్రూప్ దెబ్బకొట్టిందన్న రేవంత్ రెడ్డి**
**నాడు ఆయన వ్యాఖ్యలతో ఆగ్రహం వ్యక్తం చేసిన కమ్మలు**
**పెద్దగా వెంటరాని రెడ్లు.. అప్పటికి, ఇప్పటికి ఎంతో తేడా**
**టీపీసీసీ అధ్యక్షుడు అయ్యాక అందరూ ఆయన బాటనే..**
**కాంగ్రెస్ గెలిచి రేవంత్ సీఎం అయితే మరింత ప్రభావం**



భావజాలం పరంగా పరస్పర విరుద్ధమైన టీడీపీ, టీఆర్ఎస్, లోక్ సత్తా, బీజేపీ మద్దతుతో 2006లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ జడ్పీటీసీ సభ్యుడిగా గెలిచినప్పుడు ఎనుముల రేవంత్ రెడ్డిని మండల స్థాయి నాయకుడిగానే చూశారు.. ఆరు నెలల్లోపే కనీసం మెజారిటీ లేకున్నా మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా అనూహ్య విజయం సాధించినప్పుడు ఎవరీ ఎనుముల రేవంత్ రెడ్డి అని అందరూ ఆరా తీశారు. నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి అయితే.. స్థానిక సంస్థల్లో మనకు చాలా బలం ఉన్నా రేవంత్ ఎలా గెలిచాడు..? అంటూ ఏపీసీసీ తరఫున విచారణ కమిటీ వేశారు.. ఆ వెంటనే రెండేళ్లకు 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహా కూటమిలో టీడీపీ అభ్యర్థిగా ఉమ్మడి పాలమూరులో ఓ మూలన ఉండే కొడంగల్ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి, సీనియర్ ఎమ్మెల్యే గుర్నాథ్ రెడ్డిని ఓడించినప్పుడు ఔరా ఎనుముల రేవంత్ రెడ్డి అనుకున్నారు.. అదే రేవంత్ రెడ్డి ఇప్పుడు టీపీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సారథ్యం వహించి ముఖ్యమంత్రి రేసులో ఉన్నారు.

### ఆ రెండు సామాజికవర్గాల అండ

ప్రస్తుత ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి అటు కమ్మ, ఇటు రెడ్డి సామాజికవర్గాలు అండగా నిలిచాయనేది పరిశీలకుల అభిప్రాయం. వీటిలో రెడ్డిల గురించి ముందుగా చెప్పుకొంటే, రేవంత్ టీపీసీసీ అధ్యక్షుడు అయ్యాక ఆయనవెంట పూర్తిగా నడవడం ప్రారంభించారని అంటున్నారు. అంతకుముందు రేవంత్ ను వారు సీరియస్ గా తీసుకోలేదని.. రేవంత్ బాహాటంగానే.. నాయకత్వ సామర్థ్యం, భూముల విషయంలో "రెడ్డి"లను పొగుడుతూ వ్యాఖ్యలు చేసినా పూర్తిస్థాయిలో తమవాడిగా చూడలేదని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. అయితే, టీపీసీసీ చీఫ్ కావడంతోనే పరిస్థితి మారిపోయిందని.. రేవంత్ సారథ్యానికి గట్టి ఆమోదం లభించినట్లైందని చెబుతున్నారు. సీఎం పీఠానికి మరొక్క అడుగు దూరంలోనే ఉండడం, పదేళ్లుగా అధికారానికి దూరమైన నేపథ్యంలో రెడ్డి వర్గం అంతా ఈ ఎన్నికల్లో రేవంత్ పక్షాన నిలిచిందని విశ్లేషకులు అంటున్నారు. ఇక తెలంగాణలో రెడ్ల అంత ప్రాబల్యం లేకున్నా.. ప్రభావవంతమైన సామాజికవర్గంగానే భావించాల్సిన వారు కమ్మలు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా, నిజామాబాద్ లో కొంత, గ్రేటర్ హైదరాబాద్ లో కమ్మల ముద్ర ఉంటుంది. వాస్తవానికి టీడీపీ నేపథ్యం ఉన్నవారు కావడంతో రేవంత్ రెడ్డిపై మొదట్లో కమ్మలకు ఎలాంటి వ్యతిరేక అభిప్రాయం లేదని పరిశీలకులు పేర్కొంటున్నారు. కానీ, 2015-16లో ఓ సమావేశంలో వెల్ కం (వెలమలు ం కమ్మలు) రెడ్లను దెబ్బకొట్టారని వ్యాఖ్యానించడంతో రేవంత్ ను కమ్మలు నమ్మడం మానేశారని విశ్లేషకులు వివరించారు. ఇప్పుడు మాత్రం వీరు కూడా ఆయన వెంట నిలిచారని చెబుతున్నారు.

### చంద్రబాబు అండదండలతో

బీజేపీ విద్యార్థి విభాగం ఏబీవీపీ నేపథ్యం నుంచి వచ్చిన రేవంత్ ను రాజకీయంగా ప్రోత్సహించింది టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడే అని చెప్పాలి. వైఎస్ సీఎంగా ఉన్న సమయంలో కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించి ఎమ్మెల్సీగా గెలిచిన రేవంత్ నాయకత్వ పటిమను గుర్తించిన చంద్రబాబు కొడంగల్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. ఆపై టీడీపీ అధికార ప్రతినిధిగానూ నియమించారు. రాష్ట్ర విభజన తర్వాత అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ బాధ్యతలూ అప్పగించారు. అలాఅలా.. టీడీపీలో ఎదిగిన రేవంత్ తెలంగాణలో ఆ పార్టీ కథ ముగియడంతో కాంగ్రెస్ చేరి మూడేళ్ల వ్యవధిలోనే టీపీసీసీ చీఫ్ అయ్యారు. ఇప్పుడు సీఎం రేసులో ముందున్నారు.

### కాలం కలిసివస్తే..

రేవంత్ టీడీపీలో ఉన్నప్పుడు, టీపీసీసీ చీఫ్ అవకముందు రెడ్లు పెద్దగా వెంటరాలేదని.. కాంగ్రెస్ లోనే ఆయనను వ్యతిరేకించారని పరిశీలకులు పేర్కొంటున్నారు. కానీ, ఇప్పుడు తమవాడు అంటున్నరాని గుర్తుచేస్తున్నారు. ఇక టీడీపీని వీడాక, వెల్ కం వ్యాఖ్యల అనంతరం కమ్మలు దూరమయ్యారని పేర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో.. టీడీపీ అధినేత చంద్రబాబును స్కిల్ డెవలప్ మెంట్ కేసులో అరెస్టు చేయడం, దీనిపై హైదరాబాద్ లో ఆందోళనలు చేపట్టడాన్నిబీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కుమారుడు, మంత్రి కేటీఆర్ తప్పుబట్టడం, ఇంకా తదనంతర పరిణామాలు కమ్మలు రేవంత్ వైపు మొగ్గేలా చేశాయని పరిశీలకులు చెబుతున్నారు. ఇలా.. కాలం కలిచివచ్చి.. రేవంత్ వెంట అందరూ నడిచేలా చేసిందని చెబుతున్నారు.



**కొసమెరుపు:** 2006లో రేవంత్ పై మిడ్జిల్ లో జడ్పీటీసీగా పోటీ చేసిన రబ్బానీ నేడు మండల స్థాయిలోనే ఉన్నారు. 2007లో ఎమ్మెల్సీగా పోటీచేసిన జగదీశ్వర్ రెడ్డి ఇప్పుడు లేరు. 2009, 2014లో కొడంగల్ లో రేవంత్ చేతిలో పరాజయం పాలైన గుర్నాథ్ రెడ్డి మధ్యలో వైసీపీ, బీఆర్ఎస్ లోకి వెళ్లి రేవంత్ టీపీసీసీ అధ్యక్షుడు అయ్యాక తిరిగి కాంగ్రెస్ లో చేరారు.





# పోలింగ్ -కౌంటింగ్ ..
# 70 గంటల పైగా భరింపలేని విరహం

తెలంగాణ ఎన్నికలు ముగిసి దాదాపు 48 గంటలు అవుతోంది. ఇదే కాదు.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాల పోలింగ్ పూర్తయి కూడా 48 గంటలవుతోంది. తెలంగాణతో కాస్త అటుఇటుగా సమానంగా ఉండే ఛత్తీస్ గఢ్ లోనూ మనతో పాటే పోలింగ్ ముగిసింది. నక్సల్ ప్రభావిత రాష్ట్రం కావడంతో అక్కడ దశలవారీగా పోలింగ్ జరిపారు. ఇక ఈశాన్య రాష్ట్రమైన మిజోరంలోనూ ఎన్నికలు జరిగాయి. వీటిలో మిజోరం మినహా మిగతా రాష్ట్రాల ఫలితాలు ఆదివారం ఉదయం వెలువడనున్నాయి. మిజోరం కౌంటింగ్ ను మరొక రోజు ముందుకు జరిపారు.

### ఈసారి కాస్త నయమే..

తెలుగు రాష్ట్రాల్లో గత 20 ఏళ్లలో జరిగిన ఎన్నికలను లెక్కలోకి తీసుకుంటే.. ఫలితాల వెల్లడికి 2009లో అత్యంత ఎక్కువ సమయం పట్టింది. ఆ ఏడాది ఏప్రిల్ 16, 23 తేదీల్లో ఉమ్మడి రాష్ట్రంలో రెండు దశల్లో ఎన్నికలు జరిగాయి. ఫలితాలు మాత్రం మే 16న వచ్చాయి. అంటే తొలి దశ ఎన్నికలు పూర్తయిన నెల రోజులకు అన్నమాట. 2014లో ఏప్రిల్ 30, మే 7న ఎన్నికలు జరగ్గా.. మే 16న ఓట్లు లెక్కించారు. కాగా, ఆ తర్వాత ఏపీ రెండుగా విడిపోయిన సంగతి తెలిసిందే.

### 2018లో నాలుగు రోజులు..

తెలంగాణ ఏర్పాటయ్యాక కొలువుదీరిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరు



నెలల ముందుగానే ఎన్నికలకు వెళ్లింది. ఇలా 2018లో డిసెంబరు 7న పోలింగ్ జరగ్గా 11న ఫలితలు వెలువడ్డాయి. అంటే నాలుగు రోజుల సమయం పట్టింది. ప్రస్తుతం చూస్తే తెలంగాణలో నవంబరు 30న పోలింగ్ జరిగింది. ఫలితాలు డిసెంబరు 3న వెల్లడి కానున్నాయి. ఈ లెక్కన పోలింగ్ ముగిసినప్పటి నుంచి చూస్తే 70 గంటల పైగా సమయం అన్నమాట. ఇది గతంతో పోలిస్తే తక్కువే.

### అభ్యర్థులకు ఒత్తిడి నుంచి రిలీఫ్

పోలింగ్- ఫలితాల వెల్లడికి తక్కువ సమయం ఉండడం ఒకందుకు అభ్యర్థులకు రిలీఫ్ గానే భావించాలి. అందులోనూ ఈవీఎంలను



భద్రపరిచిన కేంద్రాల్లో లోపాలు ఉన్నాయంటూనో, ఇతరత్రా అక్రమాలకు పాల్పడుతున్నారంటూనో ఫిర్యాదులు చేసుకునేందుకు అవకాశం కూడా ఉండదు. అంటే.. ఆ చాన్సే రాదు. ఇక.. ఎలాగూ ప్రచారంలో చేసినంత చేశాం.. కాబట్టి ఎన్నికల ఫలితంపై దేవుడిదే నిర్ణయం అంటూ వేచి చూడాల్సి ఉంటుంది. మొత్తానికి పోలింగ్ కు కౌంటింగ్ కు మధ్య ఉన్న సమయంలో అభ్యర్థులు తమకు గ్రామాల వారీగా వర్గాల వారీగా పడిన ఓట్లెన్ని? పట్టణాల్లో అయితే డివిజన్లు వార్డుల వారీగా పోలైనవి ఎన్ని..? పంపిణీ చేసిన డబ్బులు ఎన్ని..? ఎక్కడైనా నిలిచిపోయాయా? అందరికీ చేరాయా? మన అనుకున్నవారంతా ఓటేశారా? అని సరిచూసుకునే పనిలో ఉంటారనడంలో సందేహం లేదు. ఇక గెలుపునకు దగ్గరగా ఉన్నామని భావించేవారిలో మాత్రం ఫలితం ఏమవుతుందో అనే టెన్షన్ ఏర్పడుతుంది.

### కుటుంబంతో గడుపుతూ.. యాత్రలకు వెళ్తూ

ఎన్నికల ప్రచారంలో తీవ్రంగా శ్రమించిన అభ్యర్థులు ఫలితాల



వరకు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు కుటుంబ సభ్యులతో గడపడమో, విహార యాత్రలకు వెళ్లడమో చేస్తారు. ఎలాగూ నాయకులలో ఎక్కువ శాతం 50 ఏళ్లు పైబడిన వారు కావడంతో వారి కుటుంబాల్లో ఎదిగివచ్చిన పిల్లలు, పెద్ద వయసు తల్లిదండ్రులు ఉంటారు. వారి యోగక్షేమాలను ఎన్నికల హడావుడిలో పట్టించుకుని ఉండకపోవచ్చు. ఫలితాల ముందర దొరికిన లీజర్ లో అవన్నీ సరిచేసుకునే అవకాశం ఉంటుంది. కాగా, మిగతా నాలుగు పెద్ద రాష్ట్రాలకు ఫలితాలు పోలింగ్ పూర్తయిన 70 గంటల్లో వెల్లడవుతుండగా, మిజోరంలో మాత్రం ఒక రోజు ఆలస్యంగా కౌంటింగ్ చేపట్టనున్నారు.